
ఆకర్షణీయం.. అనారోగ్యం



ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో లభించే స్నాక్స్ వంటి చిరుతిళ్లలో కొన్ని నాసిరకంగా ఉంటున్నాయి. అధిక మోతాదులో ఉప్పు, కారంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటిని నిరోధించేవారు కరువయ్యారు.

- విచ్చలవిడిగా స్నాక్స్ ఉత్పత్తులు
- కనిపించని నాణ్యతా ప్రమాణాలు
- పట్టించుకోని ఆహార తనిఖీ అధికారులు



ధర్మవరం లోని హోల్‌సేల్ దుకాణంలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న తినుబండారాలు

ధర్మవరం అర్బన్: స్నాక్స్ అంటే ఇష్టపడని పిల్లలు లేరు. కుర్‌కురే, కరాచి, చిప్స్, ఫింగర్ స్టిక్స్, క్లిప్స్, రింగ్స్, క్రేజీ బాల్, గిఫ్ట్ చాక్లెట్ ఇలా రకరకాల పేర్లతో అనేక తినుబండారాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. టీకొట్లు, కిరాణాషాపు, బేకరీ, ఫుట్‌పాత్, గంప వ్యాపారుల వద్ద సైతం ఇవి లభిస్తాయి. రూపాయి నుంచి రెండు, మూడు, ఐదు, పది రూపాయల వరకు వివిధ పరిమాణాల్లో లభ్యమవుతున్నాయి. చూడగానే నోరూరించేలా స్నాక్స్ ప్యాకింగ్ చేసి ఉండటంతో పిల్లలను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. బడికెళ్లే చిన్నారులు తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీతో వీటిని కొనుగోలు చేస్తున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

చిన్నారులు అమితంగా ఇష్టపడే స్నాక్స్‌పై కొందరు వ్యాపారులు దృష్టి కేంద్రీకరించారు. సంపాదనే ధ్యేయంగా పెట్టుకుని నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చారు. కొందరు బ్రాండెడ్ కంపెనీలకు దగ్గరగా అంటే ఒకటి, రెండు అక్షరాలు అటు ఇటు చేసి కంపెనీల పేర్లు పెట్టుకుని మార్కెటింగ్ చేస్తూ వేగంగా విక్రయాలు చేసుకుంటున్నారు. ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో నాసిరకం ఆహారం శరవేగంగా అమ్ముడుపోతోంది.

ప్రతి నెలా రూ.50 లక్షల సరుకు దిగుమతి

హైదరాబాద్ నుంచి ధర్మవరానికి దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే తినుబండారాలు ప్రతి నెలా దిగుమతి అవుతున్నాయి. ఒక్కో హోల్‌సేల్ వ్యాపారి నెలకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తినుబండారాల కోసం వెచ్చిస్తున్నారు. హైదరాబాద్ నుంచి లారీలు, ఐషర్ వాహనాల్లో సరుకు ఇక్కడకు వస్తోంది. హోల్‌సేల్ వ్యాపారులు నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలు, కిరాణా షాపులకు వీటిని సరఫరా చేసి అమ్ముతున్నారు.

ప్యాకెట్‌కు రూపాయి కమీషన్

బ్రాండెడ్ కంపెనీ తయారు చేసే కుర్‌కురే, కరాచి, చిప్స్ తదితర తినుబండారాలు అమ్మితే ఒక ప్యాకెట్‌పై 50 పైసలు కమీషన్ వస్తుంది. నాసిరకం తినుబండారాలు విక్రయిస్తే ప్యాకెట్‌కు రెట్టింపు అంటే రూపాయి కమీషన్ వస్తుండటంతో చాలామంది వ్యాపారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. కంపెనీ చిప్స్ 12 ప్యాకెట్లు ఉండే ఒక షీట్ అమ్మితే రూ.6 కమిషన్ వస్తుంది. అదే నాసిరకం చిప్స్ అమ్మితే రూ.12 వస్తుంది.

తనిఖీలు నామమాత్రం

మార్కెట్‌లో లభించే చిరు తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, మున్సిపల్, తూనికలు, కొలతల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెద్దమొత్తాలలో ముడుపులు అందవు కాబట్టే పర్యవేక్షణను గాలికొదిలేశారని ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. చిరుతిళ్లకు సంబంధించి పెద్దగా గిట్టుబాటు కావడం లేదని అధికారులు తనిఖీలకు వెళ్లడం లేదనే విమర్శలు ఉన్నాయి.

తింటే రోగాలు తెచ్చుకున్నట్లే..

మార్కెట్‌లో దొరికే చిరుతిళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి పలు రకాల రసాయనాలు వాడతారు. రుచి ఎక్కువగా ఉండటానికి అధికమోతాదులో మసాలాలు, టేస్టింగ్ సాల్టు కలుపుతారు. రంగుల కోసం పలు రకాల పౌడర్లు ఉపయోగిస్తారు. వీటిని పిల్లలు ఎక్కువగా తింటే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తప్పవని, ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

దూరంగా ఉండాలి



మార్కెట్‌లో దొరికే చిరు తినుబండారాలు, జంక్ ఫుడ్‌కు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వాటిలో ఉపయోగించే రసాయనాలు, రంగులతో కడుపునొప్పి, అజీర్తి వంటి తక్షణం సంభవించే వ్యాధులతోపాటు భవిష్యత్తులో ఎసిడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ చిరుతిళ్ల విషయంలో పిల్లలు, పెద్దలు అందరూ జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ ఆదిశేషు, ధర్మవరం

ఇసుకాసురులపై చర్యలేవీ?

- సమాచారమిచ్చినా స్పందన కరువు
- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతున్నా ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకర్‌నాయుడు, తంబాపురం సర్పంచ్ సానే జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డితో పాటు మరి కొందరు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ మండలంలో రీచ్, స్టాక్‌పాయింట్లు లేకున్నా చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఈ క్రమంలో భారీ వాహనాల ధాటికి రోడ్లు ధ్వంసమవుతున్నాని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులకు తెలిపినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. తాము అడ్డుకుందామనుకుంటే గొడవల పేరుతో అక్రమ కేసులు పెడతారని వెనకడుగు వేస్తున్నామని చెప్పారు. రాత్రి ఎనిమిది గంటలు దాటితే చిన్నచిగుళ్లరేవు, గరిశలపల్లి నుంచి వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారని, అలాగే రామాపురం, తంబాపురం, నార్సింపల్లి, వెంకటగారిపల్లి, లింగారెడ్డిపల్లి మీదుగా అక్రమ రవాణా సాగుతోందని తెలిపారు. ఇసుక రవాణాదారులు మద్యం తెచ్చుకుని విందు చేసుకుంటున్నారని, మత్తులో ఏవైనా అఘాయిత్యాలకు పాల్పడే అవకాశముండలేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు తహసీల్దార్ స్వర్ణలత స్పందిస్తూ తాము వివిధ పనులపై ఆర్డీఓ కార్యాలయంలోనే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోందన్నారు. పోలీసులు సీజ్ చేసిన వాహనాలకు తాము జరిమానా విధిస్తున్నామని చెప్పారు. ఉదయం సీజ్ చేస్తే సాయంత్రానికి వాహనాలు విడిపించుకెళ్తున్నారని, అలా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకునేలా తీర్మానం చేసి కలెక్టర్, ఎస్పీలకు పంపాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహానాయుడు, జెడ్పీటీసీ కోటి సుధ, శాశ్విత ఆహ్వానితుడు గుర్రం శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, వైద్యాధికారి గంగిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి, ఏపీఓ ఆదెప్ప, హౌసింగ్ ఏఈ విశ్వనాథ్, ఏఓ ఓబిరెడ్డి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, ఎంఈఓ చాముండేశ్వరి, ఉద్యాన అధికారి అమరేశ్వరి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతితో పాటు సర్పంచులు వరలక్ష్మీ, రమాదేవి, సరస్వతి, ప్రభాకరరెడ్డి, బత్తినన్న, దామోదర్, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, ఎంపీటీసీ సభ్యులు రాములమ్మ, నరేష్, మంజుల, ఆంజనేయులు, సుజాత, కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మోదుగులకుంటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: వివిధ కారణాలతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాలను మంగళవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. మోదుగులకుంటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మారక శివానందరెడ్డి కుమారుడు వారం క్రితం ప్రహరీ కూలి మృతి చెందాడు. మద్దులచెర్వు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గద్దె పురుషోత్తంరెడ్డి తండ్రి మాజీ డీలర్ చెన్నారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదే గ్రామంలో వెంగల్‌రెడ్డి కుమారుడు సోమిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల చనిపోయాడు. తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ఆయా గ్రామాల్లోని బాధితుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు మారక నరసింహారెడ్డి, మారక శివారెడ్డి, బొమ్మక ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి చర్యలు



భూమి పూజ చేస్తున్న డీఈ, ఎంపీడీఓ

బత్తలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ వారోత్సవాల సందర్భంగా విడుదల చేసిన నిధులతో పల్లెల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ రాజ్ డీఈ శ్రీరాములు, ఎంపీడీఓ నరసింహానాయుడు పేర్కొన్నారు. మంగళవారం గరిశలపల్లిలో 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ప్రజాప్రతినిధుల సహకారంతో పనులు త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టే పనులతో గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు పద్మావతి, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఓ ఆదెప్ప, పంచాయతీ కార్యదర్శి భారతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి, కునుకుంట్ల, రామాపురం గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరంగారావు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా మంజూరైన పనులు, చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

ముదిగుబ్బ: చిన్నకోట్లలో మంగళవారం 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ ఆదినారాయణ హాజరై సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఈఓఆర్‌డీ దివాకర్, ఏపీఓ రమణారెడ్డి, కార్యదర్శి ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని పి.కొత్తపల్లి, మలకవారిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ రఘునాథగుప్తా ఆధ్వర్యంలో పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ శకుంతల, ఏఓ రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ భారతి

నల్లచెరువు: సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఏఓ భారతి రైతులకు సూచించారు. కె.పూలకుంటలో మంగళవారం ఏఓ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం, విత్తన శుద్ధితో పాటూ వ్యవసాయ శాఖ పథకాలు, నూతన వ్యవసాయ పద్ధతులు, ఉద్యాన, పశుసంవర్ధక, డ్రిప్ ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ దశరథ నాయక్, వీఏఏ సాదిక్‌వలి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అవసరం మేరకే మందులు

అమడగూరు: పంటలకు అవసరమైన మేరకే మందులు వాడాలని వ్యవసాయాధికారి వెంకటరమణాచారి సూచించారు. మంగళవారం కస్సముద్రం పరిధిలోని పత్రివాండ్లపల్లి, చెర్లోపల్లిలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. రైతులతో ఏఓ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పెంచడం, ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను పెంచడం, అవసరం మేరకే రసాయన మందులను వాడకం వంటివాటిపై సలహాలను తెలియజేశారు. ఎరువులు, నీటి యాజమాన్యం, వివిధ రకాల కొత్త వంగడాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఓ నరేంద్ర, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీలుగా గుర్తించినప్పుడే వాల్మీకులకు పండుగ



మాట్లాడుతున్న నాయకులు

ధర్మవరం: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించినప్పుడే నిజమైన పండుగ అని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి యూత్ అధ్యక్షుడు చెన్నూరు నరసింహులు, రాయలసీమ నాలుగు జిల్లాల ఇన్‌చార్జ్ బోయ సాంబశివ, రెండుజిల్లాల సమన్వయకర్త చింతకాయల నరేష్ అన్నారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలుగా చేర్చాలని యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌ను కోరామన్నారు. కానీ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా చేయాలని తామెప్పుడూ అడగలేదన్నారు. కానీ కొంతమంది సోషల్ మీడియాలో, పత్రికల్లో రాష్ట్ర పండుగగా నారా లోకేష్ ప్రకటించారనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాల్మీకులను ఎస్టీలుగా చేర్చినపుడు ఆ నాయకుడి ఫోటోతో వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకుంటామని తెలిపారు.

అబ్బురం.. ప్రకృతి సోయగం







పుట్టపర్తి పరిసర ప్రాంతాలు పచ్చదనంతో కట్టిపడేస్తున్నాయి. పచ్చని పొలాలు.. ఎత్తయిన టెంకాయ చెట్లు.. నీటికుంటల్లో చెట్ల ప్రతిబింబాలు.. పచ్చదనం పరచుకున్న కొండగుట్టల మీదుగా వెళ్తున్న మేఘాలు.. చూపరులకు ఆహ్లాదం పంచుతున్నాయి. ఈ ప్రకృతి సోయగం ఊటీ, కొడైకెనాల్, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాల్లో విహరిస్తున్న అనుభూతిని కలిగిస్తోంది.

– పుట్టపర్తి రూరల్:

క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం సహించం



రిజిష్టర్ పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పోలప్ప

నల్లచెరువు: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డీఎల్‌పీఓ కె.పోలప్ప హెచ్చరించారు. మంగళవారం నల్లచెరువు–2 సచివాలయాన్ని ఎంపీడీఓ రఘునాథగుప్తాతో కలిసి డీఎల్‌పీఓ తనిఖీ చేశారు. పలువురు ఉద్యోగులు విధుల్లో కనిపించకపోవడంపై డీఎల్‌పీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు.

టిప్పర్ పట్టివేత



బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. రీచ్, స్టాక్ పాయింట్ల నుంచి మాత్రమే ఇసుక తీసుకువెళ్లాలన్నారు.

ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు



సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: జ్వాలాపురంలో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను ట్రాన్స్‌కో ఏఈ శివయ్య ఆధ్వర్యంలో ఎత్తులో అమర్చారు. ఈ నెల 12న 'త్రుటిలో తప్పిన ప్రమాదం' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. స్పందించిన ఏఈ తన సిబ్బందితో కలిసి మంగళవారం జ్వాలాపురం చేరుకుని.. విద్యుత్ వైర్లను సరిచేశారు.

మేలైన సాగు పద్ధతులు పాటించాలి

పుట్టపర్తి: మేలైన సాగు పద్ధతులు పాటించాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఏడీఏ సనావుల్లా రైతులకు సూచించారు. మంగళవారం బుక్కపట్నం మండలం కొత్తకోట పంచాయతీలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీ, ఏడీఏ మాట్లాడుతూ వరి, వేరుశనగ, కంది, తదితరల పంటలను సాగు చేసినపుడు వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే మేలైన సాగు పద్ధతులను తెలియజేస్తామన్నారు. డ్రిప్పు, స్ప్రింకర్లను వాడకం ద్వారా కలిగే ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సతీష్ బాబు, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం



బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

కనగానపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహణపై చర్చించారు. ప్రగతి నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

కార్మికుల కుటుంబాలకు చేయూత

ధర్మవరం: పట్టణంలోని పీఆర్‌టీ వీధికి చెందిన ఇద్దరు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వీరి కుటుంబాలను ఆదుకునేందుకు తోటి కార్మికులు ముందుకొచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ద్వారా పోగు చేసిన మొత్తంలో పారిశుద్ధ్య కార్మికుడు నాగేంద్ర కుటుంబానికి రూ.39,600, మల్లికార్జున కుటుంబానికి రూ.35600 నగదును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు బాబు, పట్టణ కార్యదర్శి ముకుంద, కార్మికులు లక్ష్మీఓబులేసు, పుల్లన్న, చెన్నకేశవ, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు



పరిశీలిస్తున్న ఎస్ఈ మల్లికార్జునప్ప

ముదిగుబ్బ: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునప్ప సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉప్పలపాడు వద్దనున్న తాగునీటి పథకాలతో పాటు సత్యసాయి వాటర్ స్కీం సంపులను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ శాంతన్న, తదితరులు పాల్గొన్నారు.

హార్వెస్టింగ్ పనులకు భూమిపూజ

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ వెంకట రంగారావు అధ్యక్షతన 'పల్లె పండుగ– పంచాయతీ వారోత్సవాలు' నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లకొండయ్యపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, పెద్దకోట్ల సచివాలయం ఆవరణలో రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఏపీడీ వెంకటాచలపతి, ఈఓఆర్డీ విజయ్‌శేఖర్ నాయుడు, ఏపీఓ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధుల గురించి వివరిస్తున్న సీహెచ్ఓ రామచంద్రారెడ్డి

నల్లచెరువు: బోయపల్లిలో మంగళవారం సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు సీహెచ్ఓ రామచంద్రారెడ్డి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే అరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా సాయంత్రవ వేపాకు పొగ వేసుకోవాలని, దోమ తెరలు తప్పక ఉయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రోజా, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ తస్లీమ్, ఆశా కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి హమాలీక్వార్టర్స్‌లో చాకలి నారాయణ తల్లి ఎంగమ్మ మంగళవారం మృతిచెందింది. వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ విషయం తెలుసుకుని ఆమె అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. ఈ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ముబారక్, బాబ్జాన్ పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు

నల్లచెరువు: పాపవాండ్లపల్లి రైతు సేవ కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్ ప్రాంగణాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అల్లుకుపోయాయి. చూడటానికి పచ్చగా ఉన్నప్పటికీ విష పురుగులు సంచారంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



కేజీబీవీ భవనం వెనుక..